# చాలా?

ఫస్టుక్లాస్ కంపార్ట్‌మెంటులో మాధవరావు విండోలోంచి బయటకు చూస్తూ సిగరెట్ కాలుస్తున్నాడు. అతను ముక్కులోంచీ, నోట్లోంచీ వదిలిన పొగ రకరకాలుగా మెలికలు తిరిగి గాలిలో కలసిపోతోంది. అతని పక్కనే కూర్చున్న రాధమ్మ అతన్నే కన్నార్పకుండా చూస్తూ కూర్చుంది. రాధమ్మ అతన్ని అలా చూడ్డంలో అలసిపోదు. పెళ్ళై యిరవై యేళ్ళు అయింది. అప్పటినుంచీ రాధమ్మ మాధవరావుని వీలుదొరికినప్పుడల్లా, అలా చూస్తూనే ఉంటుంది. అతనంటే ఆమెకు ఎంతో యిష్టం. అతనికీ ఆమె అంటే అంతే.

ఎదురుగా వున్న బర్త్‌మీద మరో యిద్దరు కూర్చున్నారు. వాళ్ళిద్దరూ మొగవాళ్ళే. వాళ్ళెవరో రాధకూ మాధవరావుకూ తెలీదు. వాళ్ళేదో రాజకీయాలు చర్చించుకుంటున్నారు. వాళ్ళ ధోరణిలో వాళ్ళున్నారు.

అలా విండోలోంచి బయటకు చూస్తున్న మాధవరావు పక్కనేవున్న రాధమ్మ చేయిని తన చేతుల్లోకి తీసుకొని, నెమ్మదిగా వేళ్ళు విరుస్తున్నాడు. రాధమ్మకు ఎదుటి సీటులో కూర్చున్నవాళ్ళు చూస్తున్నారేమోనని, వాళ్ళవైపు చూసింది. వాళ్ళు యిటు చూడటంలేదు. వాళ్ళ ధోరణి వాళ్ళది. చూస్తే బాగోదనిపించింది, సిగ్గనిపించింది కూడా. వాళ్ళు రాధమ్మనూ మాధవరావుని అంతగా పట్టించుకోకపోవడానికి కూడా కారణం లేకపోలేదు. ఎదుటి బర్త్‌మీద కూర్చున్న వాళ్ళిద్దరూ పాతికేళ్ళవాళ్ళు. రాధమ్మా మాధవరావు యాభై సంవత్సరాలకు దగ్గరలో ఉన్నవాళ్ళు.

మాధవరావు రాధమ్మ బొటనవేలు విరవడానికి ప్రయత్నిస్తున్నాడు అది విరగడంలేదు. కాస్త గట్టిగా ప్రయత్నించాడు. రాధమ్మకు నెప్పట్టింది. గట్టిగా అరవాలనుకుంది. అరవబోయి ఆపేసింది. మాధవరావు చేతుల్లోంచి తన చేతిని తీసేసుకోబోయింది. మాధవరావు రాధమ్మ వైపు చూసాడు. రాధమ్మ నవ్వింది. ఎందుకు రాధమ్మ నవ్విందో మాధవరావుకు అర్థం కాలేదు.

'ఊరికినే నవ్వొచ్చింది' అంది రాధమ్మ సిగ్గుపడుతూ.

'ఎందుకు నవ్వేవో చెప్పరాదూ?' అన్నాడు మాధవరావు బతిమాలుతున్నట్లు.

'అబ్బ! యింతమందిలో యిప్పుడే చెప్పాలా యేమిటి. తరువాత చెప్తాలేండి' అంది రాధమ్మ ఎదుటివాళ్ళకు వినపడకుండానూ, మాధవరావుకే వినపడేలాగాను. మాధవరావు పక్కనేవున్న ఏదో పత్రిక తీసుకొని చదువుకొంటున్నాడు.

అవునూ, తను ఎందుకు నవ్వింది? ఆ! ఔను పదేళ్ళ క్రితంనాటి సంగతి

గుర్తుకొచ్చి నవ్వింది తను. నిజంగా వేలు నొప్పిపుట్టి కెవ్వున తను అరచివుంటే, వెనక పదేళ్ళక్రితంనాడు చేసినట్టు మళ్ళీ ఎక్కడ చేస్తారోనని గతం గుర్తుకొచ్చి, నవ్వింది తను. అలా అలా ఆలోచించుకుంటూ వూహాల రెక్కలమీద గతంలోకి వెళ్ళిపోయింది రాధమ్మ. తనకూ ఆయనకూ పెళ్ళైన కొత్తలో వారికి ప్రమోషను వచ్చింది. విశాఖపట్నం నుంచి, బొంబాయి ట్రాన్స్‌ఫర్ చేసారు. తనూ బొంబాయి వెళ్ళొచ్చని ఎంతగానో ముచ్చటపడింది.

ఓనాడు సాయంత్రం ఆఫీసునుంచి యింటికొచ్చి, 'ప్రమోషన్ అక్కర్లేదని చెప్పేసాను' అన్నారు ఆయన.

తను ఎందుకన్నట్లు చూసింది అతని కళ్ళల్లోకి.

"బొంబాయిలో ఫ్లేట్ దొరక్కుండా నిన్ను తీసుకెళ్ళడం కుదరదు. నువ్వు లేకుండా నన్ను బొంబాయి కాదు న్యూయార్క్ పంపించినా నేను వెళ్ళను." అతను అలా అన్నప్పుడు తన మనసు పున్నమి వెన్నెలలో తడిసిన సముద్రంలా పొంగిపోయింది. మరో జన్మంటూ వుంటే, యీయన భార్యనే కావాలనీ, జన్మ జన్మలకీ యీయన భార్యనే కావాలని తను అనుకోలేదు గాని, ఇంక జన్మే అక్కర్లేదనుకుంది తను. నిజమే మరి, తనని ఆయన అంతగా ప్రేమించేవారు. నిముషం తనని వదిలి వుండేవారుకాదు - ఆ ఆఫీసు వేళను తప్ప.

తింటే కలసి తినాలి, నడిస్తే కలసి నడవాలి, నిద్రపోతే కలసి నిద్రపోవాలి, సినిమా చూస్తే కలసి చూడాలి. విడివిడిగా ఒక్కక్షణం వుండటానికి వీల్లేదు. ఆయనది పసిపిల్లాడి మనస్తత్వం. యిట్టే కోపం వస్తుంది. కోపం వచ్చినా దాచుకోలేరు. ఆనందం వచ్చినా పట్టలేం. అందుకే ఆయన్ని తను పసిపిల్లాడిలాగే చూసుకునేది. చూసుకునేదేమిటి, యీనాటికీ అలాగే చూసుకుంటోంది అతన్ని తను. లేకపోతే గొడవచేసేస్తారు. గత పదేళ్ళనాడు చేసినంత గొడవ చేసేస్తాడు. ఆ సంఘటన గుర్తుకొచ్చే నవ్వుకుంది తను.

అతను తనని ప్రేమించడమేగాదు తనూ అతన్ని విడిచి ఒక్కక్షణం వుండలేదన్న సంగతి పదేళ్ళనాడే రుజువైపోయింది.

పెళ్ళయిన కొత్తలో ఎంత చేరువుగా వుండేవారో యిద్దరు పిల్లలు పుట్టాక కూడా అలాగే వుండేవారాయన. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక కూడా అలాగే వుండేవారు. ఇప్పటికీ అలాగే వున్నారు.

ఇద్దరం ఒకే రూంలో డబల్ కాట్ బెడ్డుమీద పడుకోవాలి. అది డబల్ కాటే అయినా, ఎప్పుడూ సింగిల్ కాట్ కాళీగానే వుంటుంది. యీ యిరవైయేళ్ళూ అలాగే గడిచాయి. తను పుట్టింటికి పురిటికి వెళ్ళినా, పండగకు వెళ్ళినా వెంటవచ్చేసేవారు.

అలా ఆ రోజున ఇద్దరం డబల్ కాట్‌లో సింగిల్ కాట్ కాళీగా వదిలేసి పడుకున్నాం.

కరెంటు పోయింది. మెలకువ వచ్చేసింది తనకి. వళ్ళంతా చెమట. వారు మరీ

దగ్గరకు జరిగి తనని దగ్గరకు తీసుకున్నారు. చిరాగ్గా వుండి 'అబ్బ జరగండీ', అంది తను. తన మీదనుంచి అతని చేతిని తీసేస్తూ.

తెల్లవారింది.

బ్రీఫ్‌కేసులో ఒక జత బట్టలు వేసుకొని 'నే వెడుతున్నా' అంటూ మాధవరావు బయట కెళ్ళాడు.

'ఎక్కడికీ' అని వంటింట్లోంచి అరచింది తను.

జవాబు రాలేదు. తను వంటింట్లోంచి హాల్లోకి వచ్చేసరికి అయనగారు అప్పటికే రోడ్డెక్కేసారు.

ఆ సాయంత్రం యింటికి రాలేదు అయన.

ఎప్పుడూ చెప్పకుండా రాత్రికి యింటికి రావడం మానలేదు అయన. ఆ రాత్రంతా తనకి నిద్రేపట్టలేదు. అతను తనపక్కన లేని రాత్రులు ఆ పదేళ్ళలో వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. 'ఎక్కడ కెళ్ళివుంటారా' అని తెగ ఆలోచించింది తను. అంతు చిక్కలేదు. జాడ తెలియలేదు.

మళ్ళీ తెల్లవారింది. ఆ రాత్రంతా నిద్రలేదు. ఆ రోజు పగలుకూడా రాలేదు అయన.

అలా మరో రెండు రోజులు గడిచాయి. రెండవ రోజునుంచి భోజనం కూడా మానేసింది తను. నిద్రాహారాలకు దూరమైంది తను. అతని ఆలోచనే మనసునిండా. ఓ పక్క చెప్పకుండా వెళ్ళిపోయాడని కోపం. మరోపక్క ఒక్కరూ ఎక్కడ ఎలావున్నారోనని బాధ. అసలు ఎందుకెళ్ళేరో, ఎక్కడికెళ్ళేరో తెలీక ఆవేదన.

అలా అయన ధ్యానంలోనే వుండగా మధ్యాహ్నం మూడుగంటలకి పోస్ట్‌మేన్ 'పోస్ట్' అంటూ ఓ కార్డు వాకిట్లో పడేసి వెళ్ళిపోయాడు.

తను గబగబావెళ్ళి ఆ కార్డు తీసుకుంది.

ఉత్తరం! వారిదగ్గరనుంచే!

'మాధవరావు', 'విజయవాడ.'

'విజయవాడ వెళ్ళేరన్నమాట. ఎందుకు చెప్మా' అనుకుంది తను.

ఎందుకైతేనేంలె. ఇంతకీ యేమిరాసారో అనుకుంటూ చదవసాగింది తను. చదవడానికి ఏముందా వుత్తరంలో.

'చాలా?' అని మాత్రం వుంది. ఏమిటోనబ్బా! యీయనగారి వుత్తరం. 'చాలాట చాలా' నాకేమీ బోధపడటంలేదు. మరో రెండు వాక్యాలు రాస్తే కొంపేం మునిగిపోతుందో యీయనగారిది - అలా తనలో తనే నసుగుకుంటూ వుండిపోయింది తను. కళ్ళలో నీళ్ళు తిరిగాయి తనకి.

వెనకనుంచి 'జరగమన్నావుగా అటు మొన్నరాత్రి. విశాఖపట్నంనుంచి, విజయవాడదాకా జరిగాను. చాలా? యింకా జరగాలా?' అని ఉత్తరం రాసాను అన్నాడు మాధవరావు.

వెనక్కి తిరిగి 'కాస్త జరగమంటే యింత శిక్షా' అన్నట్లు చూసింది తను అతని కళ్ళలోకి.

మాధవరావు కరిగిపోయి, 'ఇంకా ఏడిపిద్దామనుకున్నాను గాని, యీ వుత్తరం రాసి, ఆ అడ్రసు రాసాక యింక వుండలేకపోయానోయ్. ఉత్తరం ఏ రైల్లో వస్తుందో ఆ రైల్లోనే నేనూ వచ్చేసాను' అన్నాడు.

ఆ విషయం గుర్తుకొచ్చే నవ్వుకుంది తను. ఇప్పుడు అతను వేళ్ళు విరుస్తూ వుండగా నొప్పిపుట్టి తను అరచి, 'వదలండీ' అని అంటే నిజంగానే తనను వదిలేసి రైలు దిగి ఎక్కడికేనా వెళ్ళిపోతారేమో కొంపతీసి అని నవ్వొచ్చింది తనకి.

తీరా ఇందుకు నవ్వొచ్చిందని చెబితే ఏంచేస్తారో యీయనగారు – అనుకుంది రాధమ్మ.

★ ★ ★